# అశనిపాతం

-కె. పుష్పాదేవి

"నాన్నా శివా ఇందాక సూర్యారావు గారు వచ్చారురా" అన్నది కాత్యాయని అప్పుడే వచ్చిన కొడుక్కి మంచినీళ్ళు అందిస్తూ.

"ఏ సూర్యారావు గారమ్మా..." షూ విప్పుకుంటూ అడిగాడు శివాజీ.

"అదేరా పెళ్ళిళ్ళ బ్రోకరు. కాకినాడలో ఒక మంచి సంబంధం ఉందట. చాలా ఆస్తిపరులట. కానీ, వాళ్ళకు ఇద్దరూ అమ్మాయిలే గానీ, అబ్బాయిలు లేరట. అందుకని వద్దని చెప్పాను..." గ్లాసు లోపలికి తీసుకువెళ్తూ అన్నది ఆమె.

"భలే పని చేశావమ్మా, కొడుకులు లేకపోతే ఏమవుతుంది..? ఆయన్ని మళ్ళీ వచ్చి, ఆ సంబంధం వివరాలన్నీ చెప్పమని ఫోను చెయ్యి...' లుంగీ కోసం వెతుకుతూ అన్నాడు శివాజీ.

"అదిగో నీ లుంగీ ఎదురుగానే ఉంది. అయినా, ఒక్కడైనా బావమరిది లేకపోతే ఏం బావుంటుందిరా..? ఒక అచ్చటా, ముచ్చటా ఉంటుందా..., "బావమరిది బాగు కోరతాడు" అంటారు. ఆడపిల్లకు కష్టంలోనూ, సుఖంలోనూ తోడుగా ఉంటాడురా తోడపుట్టిన వాడు..."

"ఆc ఆc నీదంతా పెద్ద చాదస్తం. ఏం ఫరవాలేదు గానీ, ఆయన్ని రమ్మని చెప్పు. వివరాలు తెలుసుకుందాం..." ముఖం కడుక్కోవడానికి పెరట్లోకి వెళ్తూ ఆర్డర్ పాస్ చేశాడు శివాజీ.

"ఏమిటో వీడు... తండ్రి లేకుండా పెరగడంతో అంతా వీడి ఇష్టారాజ్యమై పోయింది. నా మాట వింటాడా... ఏమన్నానా...?" గొణుక్కుంది కాత్యాయని.

❖ ❖ ❖

సుప్రియ రూపానికీ, గుణానికీ కూడా ఎన్నదగిన మనిషి. శివాజీకి బ్యాంక్ క్యాషియర్‌గా హైదరాబాద్‌లో ఉద్యోగం రావడం వల్ల వాళ్ళు కాపురం అక్కడ పెట్టారు. శివాజీ మంచివాడేగానీ, విపరీతమయిన పీనాసితనం అతనికి. తల్లిదండ్రులకు అతను ఒక్కడే కొడుకు. బోలెడు ఆస్తి ఉన్నది. ఉద్యోగం ఉన్నది. అయినా, అతని డబ్బు కక్కుర్తికి మితి ఉండదు.

సుప్రియ అక్క మధుప్రియ. వాళ్ళ ఆయనకు కాకినాడలోనే ఉద్యోగం. ఈమె కూడా అక్కడే ఉద్యోగం చేస్తోంది. ఇద్దరు పిల్లలు. ఆమె ఆఫీసుకి వెళ్ళాలి గనుక, పిల్లలు చాలావరకూ అమ్మమ్మ గారింటిలోనే ఉంటూ ఉంటారు. శివాజీ అడిగాడు సుప్రియను, "ప్రియా మీ అక్క పిల్లలెప్పుడూ మీ అమ్మ గారింటిలోనే ఉంటారే మిటని"

"మరి అక్క ఆఫీసుకి వెళ్ళాలి గదా, వాళ్ళ అత్తగారు పిల్లలను చూసుకోలేరు. అందుకని అమ్మే వాళ్ళను అట్టిపెట్టుకుంటుంది. అమ్మా వాళ్ళకయినా అంతకన్నా కాలక్షేపం ఏముంది లెండి... నేను కూడా వచ్చేశాక ఇల్లంతా బోసిపోయిందని గోల పెడుతున్నారు. ఆ పిల్లలుండబట్టి సరిపోయింది గాని..." అన్నది సుప్రియ భర్తకు తల దువ్వుతూ.

"ఇదొక పిచ్చి ముఖం. ఎంత చిన్న పిల్లలైనా ఈ రోజుల్లో వాళ్ళకు కూడా ఎన్ని ఖర్చులుంటాయి...? వదినగారు తెలివిగా ఆ ఖర్చులన్నీ పుట్టింటి మీద రుద్దేస్తోంది..." బయటపడితే బావుండదని మనసులోనే పళ్ళు కొరుక్కున్నాడు శివాజీ.

''శివాజీ అత్తగారితో ఎప్పుడు ఫోనులో మాట్లాడినా, "ఆయిల్ ఫుడ్స్ తినకండి. అది ఈ వయసులో మీ ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ఇంట్లో కూడా జాగ్రత్తగా నడవండి. ఫ్లోరింగ్ నునుపవడం వల్ల కాలుజారే ప్రమాదముంది..." అని చెప్తుంటాడు. "అబ్బో... మా చిన్నల్లుడి గారికి మా మీద ఎంత ప్రేమో..." అని అత్తా మామలిద్దరూ మురిసిపోతుంటారు.

ఆయిల్ ఫుడ్స్ ఖరీదు ఎక్కువ. అదీగాక అవి తిని, రోగాలు తెచ్చుకుంటే మందులకూ, మాకులకూ బోలెడు డబ్బు పొయ్యాలి. ఒకవేళ కాలుజారి ఫ్రాక్చర్ అయితే, సిమెంటు కట్టు అనీ, అదనీ ఇదనీ డాక్టర్లు మన

## ప్రేమ!

నీ కోసం / తలపుల తలుపులు / తెరిచే వుంచేను!
నువ్వేమో
గుండె గుమ్మానికి
తోరణం కట్టలేదు!

-మిస్టర్ గుడి

డబ్బంతా మింగేస్తారు" ఇదీ శివాజీ అభిప్రాయం.

"పెళ్ళి అయిన తరువాత, మొదటి పండుగ దసరా వచ్చింది. మామగారి ఆహ్వానం మేరకు భార్యతో బయలుదేరాడు శివాజీ. పెద్ద కూతురూ, అల్లుడూ కూడా వచ్చారు. పెద్ద కూతురి అత్తగారూ, మామగారూ ఒంటరిగా ఏం ఉంటారు లెమ్మని వాళ్ళనూ పిలిచారు. కొత్తల్లుడు, మొదటిసారి పండుగకు వచ్చాడు గదా అని అత్తగారు రకరకాల పిండి వంటలు చేశారు మూడు రోజులూ.

"అమ్మో... ఎంత ఖర్చు... ఎంత ఖర్చు..." శివాజీ మనసు లబోదిబోమంటోంది. మామగారు ఇద్దరు కూతుళ్ళకూ, ఇద్దరు అల్లుళ్ళకూ తలో రెండువేలూ ఇచ్చారు నచ్చిన బట్టలు కొనుక్కోమని. పిల్లల కోసం అదనంగా మరో రెండువేలు ఇచ్చారు పెద్ద అల్లుడి చేతికి. అతని తల్లిదండ్రులకు కూడా బట్టలు పట్టుకు వచ్చారు. ఇదంతా చూసి శివాజీ మనసు కుతకుతలాడి పోయింది. "నేనంటే క్రొత్తవాణ్ణి. మొదటి పండుగకు వచ్చాను. నాకు ఇవ్వడంలో అర్థం ఉంది. అతను ఒకే ఊళ్ళో ఉండి, మామగారి సొమ్ము తెగతింటూనే ఉన్నాడు గదా.., ఇంకా ఈ పండుగ స్పెషల్స్ ఎందుకో... పెళ్ళి అయి ఇన్నేళ్ళయినా.., సిగ్గులేకపోతే సరి..."

ఇచ్చిన ఆయనా, పుచ్చుకున్న ఈయనా ఆనందంగా, సరదాగా కబుర్లు చెప్పుకుంటుంటే... శివాజీ మాత్రం ముఖం గంటుపెట్టుకుని, రాయిలా కూర్చున్నాడు. ఇప్పుడు నేను పండుగ బహుమతిగా ఏ టీవీనో, ఫ్రిజ్జో అడగచ్చు, ఇస్తారు. కానీ.., నాకు పోటీగా అతనూ తయారవుతాడు..." పాపం... శివాజీ మనసులో మథనపడిపోతున్నాడు.

❖ ❖ ❖

"మీ అక్కలాగా నువ్వూ ఉద్యోగం చెయ్యచ్చు గదా..." అడిగాడు శివాజీ భార్యను ఒకరోజు.

"నాకు ఉద్యోగం చెయ్యాలన్న ఆసక్తి అసలు లేదు. మనకేమీ డబ్బుకి కొరత లేదు గదా..., కష్టపడి ఉద్యోగం చెయ్యడానికి. ఒకవేళ, ఇప్పుడు ఉద్యోగం కోసం వెతుక్కుని చేసినా, రేపు ప్రెగ్నెన్సీ వస్తే కష్టం. ఎందుకు వచ్చిన తిప్పలు ఇవన్నీ... అంటూ తేలికగా తీసివేసింది సుప్రియ.

ఆ జవాబు కష్టంగా ఉన్నా, "ఇక భార్యకు నచ్చచెప్పలేను" అని మెదలకుండా ఊరుకున్నాడు శివాజీ. అతను ఇంట్లో పనులకు పనిమనిషిని పెట్టడానికి

## ఈ దేశపు మర్యాదస్తులు

నెలలో మొదటి రోజంటే నా కిష్టం!
పింఛను పుస్తకాలు చేతబట్టుకొని
'మంచి బాలురకు' మల్లే హాజరవుతుంటారు
ప్రతీ నెల నేను చూస్తున్న వాళ్ళే!
అయినా మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే వాళ్ళు
ఈ దేశపు మర్యాదస్తులు.. 'సీనియర్ సిటిజన్స్'
జీవిత నాటకం చరమాంకంలో
జీవన్మరణాల 'ఏక్‌తార'ని
కొనగోటితో సుతారంగా మీటుకుంటూ
వృద్ధాప్యాన్ని హుందాగా భరిస్తున్న తల్లులు, తండ్రులు!
రోగాలతో కుటుంబ భారాలతో
దిగులు శిలువల్ని మోస్తున్న వృద్ధ క్రీస్తులు
సడలిన దేహాల బరువు కంటే
వృద్ధాశ్రమాలలో కొడుకులు వొదిలిపోయిన
ఏకాంతపు ఒంటరితనంతో / కృంగిపోతున్న జీర్ణ
దేవాలయాలు! / పక్షులెగిరిపోయాక
గూళ్ళ జ్ఞాపకాలను మిగుల్చుకున్న
ఒంటరి వృక్ష సమూహాలు / జీవితం గంధపు
చెక్కని / అరవై ఏళ్ళు నిరంతరాయంగా
అరగ దీసుకున్నందుకు
ప్రతిఫలంగా వచ్చే పింఛను ఇంధనంతో
బతుకు బండిని లాగుతున్న వాళ్ళు!
ఈ దేశపు స్వాతంత్ర్య సమరయోధుడు!
ఒక మాజీ సైనికుడు... ఒక ఉపాధ్యాయుడు
ఒక శాస్త్రవేత్త... ఓ కళాకారుడు
ఎందరో మరెందరో... ఈ నేలకు
తమ రక్తాన్ని, చెమటని ధారపోసిన వాళ్ళు
నిజాయితీని నిలువెల్లా పట్టించుకున్న వాళ్ళు
అంత వయస్సులోనూ ఆ గాజు కళ్ళల్లో
చిరు గర్వం తొణికిసలాడుతోంది!
తడబడుతోన్న నడకల్లో సైతం
రాజఠీవి వుట్టిపడుతోంది!
రంజాన్ నెల చందమామ నవ్వులతో
బోసి నవ్వుల పాపాయిల్ని మరిపిస్తూ...
గత కాలపు వైభవానికి చిహ్నాలై మిగిలిన వాళ్ళు
మన వాళ్ళు... మన ఉన్నతికి సోపానాలు పరిచిన వాళ్ళు
మన కీర్తి సౌధాలకు పునాదులై నిలిచిన వాళ్ళు
వాళ్ళని మనసారా గౌరవించుకుందాం
ఎంత చేసినా రుణం తీర్చుకోలేని వారి త్యాగానికి
తలలు వంచి సాదరంగా నమస్కరిద్దాం
ఈ దేశపు మర్యాదస్తులు.. వారికి జేజేలు పలుకుదాం.

-కొప్పోలు మోహనరావు

కూడా ఉత్సాహం చూపించలేదు. "ఆ ఖర్చు దండుగ" అని అతని ఉద్దేశ్యం. పుట్టింట్లో పనులు చెయ్యడం అసలు అలవాటు లేకున్నా, ఇక్కడ అన్నీ సుప్రియే చేసుకునేది. "ఆ మాత్రం పనులు చేస్తే ఒంటికీ మంచి దేలే" అనుకుని. ఆమె కోరిక మీద ఎప్పుడైనా సినిమాకో, షికారుకో తీసుకువెళ్ళినా, తరువాత, "వెళ్ళి వచ్చినందుకు ఇంత ఖర్చు అయింది" అని లెక్కలు వేసేవాడు. అది ఆమె మనసుకు కష్టంగా తోచి, అడగడమే మానుకున్నది.

తరువాత దీపావళి పండుగకు మామగారి ఆహ్వానం అందినా, శివాజీ వెళ్ళడానికి ఇష్టపడలేదు. వెళ్తే ట్రైను ఖర్చులవుతాయి. "ఆ పండుగ ప్రజంటేషను యమ్.వో. రూపంగానో, డి.డి. రూపంగానో పంప వచ్చు గదా" అని అతని భావన. సెలవు దొరకలేదని వంక పెట్టాడు. ఇతని ఆలోచనలు తెలియని మామ గారు "నిజమే కాబోలు" అనుకున్నారు. యమ్వోలూ, డీడీలూ ఏమీ పంపలేదు. సంక్రాంతి పండగకయినా తప్పకుండా రావాలని గట్టిగా చెప్పారు.

"మీరే మా ఊరు రండి పండుగకు" అంటూ ఆహ్వానించాడు శివాజీ మామగారిని. తోడల్లుడి ఖర్చు ఆయనకు తప్పించాలన్న అభిప్రాయంతో. ఇతని కపట బుద్ధి తెలియని సుప్రియ, అక్కా వాళ్ళని కూడా పిలుద్దామండీ... అందరం సరదాగా గడపవచ్చు..."

## ప్రాణం

విషాదం విశ్వమంతా వ్యాపించినపుడు
నాకు నీవున్నావనే స్వాంతనలో
నిశ్చింత పొందుతాను. ఆనందం
హద్దులు దాటి అంబరాన్నంటినపుడు
దానిని నీతోనే పంచుకోవడానికి
పరుగులు పెడతాను. నిజం ప్రియతమా!
నన్ను నమ్ము. కావాలనుకుంటే చిరునవ్వు రాదు.
వద్దనుకుంటే దుఃఖం ఆగిపోదు.
అయినా ఈ రెంటినీ నీతోనే
పంచుకోవాలనుకుంటాను.
కాలే గుండెనయినా, కోసే గాయాన్నయినా
నీ స్పర్శలోనే మర్చిపోవాలనుకుంటాను
ఎందుకంటే ఈ దేహం నాదే కాదనను.
కాని, ఇందులో ప్రాణం మాత్రం నీవే.

**–ఉలాపు బాలకేశవులు**

అని బతిమాలింది.

ఏ రకంగా ఆమె కోరికను తిరస్కరించాలో తోచక, "సరే" అనక తప్పలేదు శివాజీకి. పిలిచిందే తడవుగా అందరూ వచ్చేశారు. "ఏదో మాటవరసకు పిలిస్తే మాత్రం అందరూ కట్టకట్టుకుని వచ్చేయాలా..." శివాజీకి చాలా చిరాకు వచ్చింది. అది ఎవరిమీద ఎలా చూపించాలో తెలియక, తన మీద తనే చూపుకున్నాడు "అనవసరంగా పిలిచానని."

"పిండివంటలతో, పిల్లలకు భోగిపళ్ళతో సంక్రాంతి పండుగ శివాజీకి తప్ప, అందరికీ సరదాగా గడిచింది. వాళ్ళందరూ మొదటిసారి మనింటికి వచ్చారు. బట్టలు పెడితే బాగుంటుంది..." బాంబు పేల్చింది సుప్రియ.

"తోడల్లుడి ఖర్చు మామగారికి తప్పిద్దామను కున్నానే గానీ, ఆ ప్లాను బెడిసి కొట్టి, అది ఇలా ఉరితాడై నా మెడకు చుట్టుకుంటుందనుకోలేదు..." స్పృహ తప్పినంత పనయింది శివాజీకి. కానీ, కాదన లేని పరిస్థితి. అందుకే అన్నారేమో పెద్దలు. "ఎవరు తీసుకున్న గోతిలో వాళ్ళే పడతారని" అనుకున్నాడు నీరసంగా.

❖ ❖ ❖

ఒక రోజు అన్నాడు శివాజీ, సుప్రియతో నేను మా అమ్మా నాన్నకు ఒక్కగానొక్క కొడుకుగా పుట్టినట్లు, నువ్వు కూడా ఒక్కగానొక్క కూతురిగా పుట్టి ఉంటే ఎంత బాగుండేదో గదా..." అని.

"ఏమీ బాగుండదు. ఒంటికాయ సొంఠి కొమ్ము లాగా. మనసుకయినా, మాటకయినా, కష్టంలోనూ, సుఖంలోనూ "నా" అన్న వారు లేకుండా. ఇప్పటికే మాకు అన్నదమ్ములు లేరని బాధపడుతుంటాము అక్కా నేనూ..." అన్నది అతని మనసు తెలియని సుప్రియ.

"ఏమిటీ మనిషి..? ఇలా ఆలోచిస్తారు..? ఒక్క క్షణం అతని గురించి బాధపడింది గానీ, వెంటనే మరిచిపోయింది ఆమె. ఆ రోజు శివాజీ బ్యాంకు నుండి వచ్చేసరికి ఆనందోత్సాహాలతో ఒక వార్త చెప్పింది. "అక్కా వాళ్ళ బాబుని నాన్నగారు దత్తత చేసుకుందామని నిర్ణయించుకున్నారట. రేపు పదహారో తారీకు ముహూర్తమట. మనల్ని నాలుగు రోజులు ముందుగానే రమ్మని మరీ మరీ చెప్పారు. శుభలేఖలు ప్రింటింగ్‌కు ఇచ్చారట..." సుప్రియ ఇంకా ఏమిటేమిటో చెప్తోంది ఉప్పొంగిన ఆనందంతో. శివాజీ తలమీద హైడ్రోజన్ బాంబు పేలింది. ఈసారి నిజంగానే కుప్ప కూలిపోయాడు అతను. ■